ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.05-07-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పిల్లలు, మహిళల రక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.
2. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రాంచందర్ రావు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు.
3. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచీ పరిశ్రమలో ఆరో రోజు శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. ఇంకా రెండు మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.
4. నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల ఈ రోజు, రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

-----------------------------

**ముఖ్యమంత్రి**

పిల్లలు, మహిళల రక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి అభివృద్ధి కేంద్రంలో పోక్సో చట్టంపై ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ పోలీసులను అభినందించారు.

------------- **బైట్ ముఖ్యమంత్రి** -----------

లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, బాలికల సంరక్షణ కోసం తెలంగాణ “భరోసా” ప్రాజెక్టును తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దీనికి

అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయని, ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నామని చెప్పారు. ఫోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయని, సామాజిక మాధ్యమాల ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

**SDP**

------------------------------

**BJP TELANGNA PRESIDENT**

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రాంచందర్ రావు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ సహ పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకముందు ఉదయం చార్మినార్ వద్దనున్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రాంచందర్ రావు విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలకు బీజేపీ అండగా నిలబడుతుందని, పార్టీని నమ్ముకున్న వారిని ఎప్పుడూ బీజేపీ మోసం చేయదని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అవకాశాలు ఉంటాయని, దానికి తానే ఉదాహరణ అని చెప్పారు.

**డెస్క్**

-----------------------------

**పాశమైలారం**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచీ పరిశ్రమలో ఆరో రోజు శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 9 మంది ఆచూకీ లభించలేదు. వీరి కోసం మృతదేహాల శేషాలు, వ్యక్తిగత వస్తువులు, ఆధారాలు సేకరించి, అవసరమైన డిఎన్ఎ

శాంపిల్స్  ల్యాబ్‌కు పంపినట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య తెలిపారు.  ఈ ప్రమాదంలో మరణాల సంఖ్య 42కి చేరింది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 143 మంది కార్మికులు పనిచేస్తుండగా ఇప్పటివరకు 61 మంది సురక్షితంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. 23 మంది క్షతగాత్రులలో కోలుకున్న 12 మందిని డిశ్చార్జ్ చేశారు. మరోవైపు పటాన్ చెరు ఆస్పత్రిలో ఉన్న రెండు మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది.

**పీటీసీ, సంగారెడ్డి**

-------------------------

**KTR**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీళ్లను ఆంధ్రాకు, నిధులను పార్టీ పెద్దలకు పంపుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు. హైదరాబాద్ లో ఆయన ఈ రోజు మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డికి నదులు, బేసిన్ల గురించి కూడా తెలియదని విమర్శించారు. నిన్న కాంగ్రెస్ బహిరంగ సభలో రైతు సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అని రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కు తాము సిద్ధమని,  సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో 8వ తేదీ, 11 గంటలకు చర్చకు వస్తామని కేటీఆర్ ప్రతి సవాల్ విసిరారు. రాష్ట్రం ఏర్పాటైన కొత్తలోనే తమ ప్రభుత్వం 30వేల కోట్ల రూపాయిల రైతు రుణమాఫీ చేసిందని, విప్లవాత్మక రైతు బంధు పథకం తీసుకొచ్చిందని చెప్పారు.

**డెస్క్**

-------------------------

**బండి సంజయ్**

అక్రమంగా రోహింగ్యాలు ఉంటున్న ప్రాంతాలలో తనిఖీ చేపట్టడంతో పాటు వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. రోహింగ్యాలపై పోరాడుతున్న పలువురు బీజేపీ కార్యకర్తలను

వేధిస్తున్నారని సమాచారం అందుకుని రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడారు.

**MSM**

----------------------------------

**ALLURI RAJU:**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ ఆయనకు నిన్న ఘనంగా నివాళి అర్పించారు. హైదరాబాదులోని శిల్పకళా వేదికలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాజ్ నాథ్ సింగ్... అల్లూరి సీతారామరాజును రంప విప్లవాన్ని గుర్తుచేసుకున్నప్పుడు ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఒక యువ దర్శనికుడు కనిపిస్తాడని అన్నారు. తమ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తోందని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో బాలికలకు పాఠశాలలు, దగ్గరలోనే హాస్టల్ సౌకర్యాలు కల్పిస్తోందని రాజ్నాథ్ సింగ్ అన్నారు.

**Sound bite ... రాజ్ నాథ్ సింగ్**

**DESK**

---------------------------------

**BREAK....**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

------------------------

**వరంగల్ కలెక్టర్**

రైతులకు ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్  జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా హెచ్చరించారు. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామంలో వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీలో ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఎరువుల నిలువలు, స్టాకు రిజిస్టర్లు, గోదాం, తూకం యంత్రాలు, రసీదు పుస్తకాలను కలెక్టర్ ఈ రోజు పరిశీలించారు.

**పీటీసీ/వరంగల్**

----------------------------

**సిద్ధిపేట ఆయిల్ ఫామ్**

సిద్దిపేట జిల్లాకు ఇచ్చిన ఆయిల్ పామ్ సాగు లక్షాన్ని తప్పనిసరిగా పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని ఆయిల్  ఫెడ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ హైమావతి సమీక్షా నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 వేల 339 ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగవుతుండగా, ఈ ఏడాదిలో మరో  6500 ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**పీటీసీ, సిద్ధిపేట**

-------------------------

**సిద్ధిపేట**

సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి కొండపాకలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బిసి బాలుర గురుకుల పాఠశాల,  జూనియర్ కళాశాలను, బాలికల గురుకుల పాఠశాలల్లో ఈరోజు ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. వంట గదిని శుభ్రంగా ఉంచాలని, కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపల్ ని ఆదేశించారు.

**పీటీసీ, సిద్ధిపేట**

---------------------------------

**WEATHER UPDATE**

నైరుతి రుతుపవనాలు, వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్ర తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంటూ ఆ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గడిచిన 24 గంటల్లో నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురువగా, అత్యధికంగా నిర్మల్ జిల్లా నిర్మల్ గ్రామీణ మండలంలో 2.87 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు జలాశయాలలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 19.6 అడుగులకు చేరుకుంది. కిన్నెరసాని, తాలిపేరు జలాశయాలు నిండుతున్నాయి. తాలిపేరు గరిష్ట నీటిమట్టం 74 మీటర్లు కాగా ప్రస్తుతం 70 మీటర్లుగా నమోదు అయింది.

**PN & PTC-ASIFABAD, Kottagudem**

---------------------

**NOTE**

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగం తాత్కాలిక ప్రాతిపదికన నెలకు గరిష్టంగా 6 రోజులు మాత్రమే పని చేసేందుకు తెలుగు, ఇంగ్లీష్ న్యూస్ ఎడిటర్లు, తెలుగు, ఉర్దూ న్యూస్ రీడర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తులు చేరవలసిన చివరి తేదీ 18. కాగా, అభ్యర్థులు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారై ఉండాలి. పూర్తి

చేసిన దరఖాస్తులను స్వయం ధృవీకరణ సర్టిఫికేట్ కాపీలు , రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జతచేసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఇ), ఆకాశవాణి, సైఫాబాద్, హైదరాబాద్ – 500 004 చిరునామాకు పంపాలి. ఇంతకుముందు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరలా దరఖాస్తు చేయనవసరం లేదు. వివరాల కోసం www.newsonair.gov.in/vacancies వెబ్ సైట్ లో చూడగలరు.

**DESK**

----------------------------

**నల్లగొండ జిల్లా తపాలా సేవలు**

తపాలాశాఖలో ఈనెల 8 నుంచి అన్ని పోస్టాఫీసుల్లో ఆన్ లైన్ సేవలు అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తపాలా శాఖ నల్గొండ డివిజన్ సూపరింటెండెంట్ రఘునా థస్వామి తెలిపారు. పోస్టాఫీసులో ఈ సేవలు అమలు చేయడానికి ప్రయోగాత్మకంగా తెలంగాణ సర్కిల్ పరి ధిలోని ఉమ్మడి నల్గొండ జిల్లాను ఎంపిక చేశారని తెలిపారు.

**పీటీసీ/నల్గొండ**

--------------------------------

**END:**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.

-------------------------------------